ఆందోళన వీడి... చర్చలకు రండి

కార్మిక సంఘాలకు రవాణా మంత్రి పిలుపు



మంత్రి శివశంకర్

ప్యారీస్, జనవరి 3: రాష్ట్రప్రభుత్వ రవాణా శాఖకు చెందిన కార్మిక సంఘాలు చేపట్టిన పోరాటాన్ని విరమించి చర్చలకు రావాలని రవాణా శాఖ మంత్రి శివశంకర్ విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి తదితర డిమాండ్లతో రవాణా కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొనేందుకు పలు ఉద్యోగ సంఘాల మద్దతు కోరుతున్న నేపథ్యంలో ఆందోళన విరమించాలని మంత్రి శివశంకర్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, పదవీవిరమణ పొందిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరింపజేయాలని కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తున్నాయన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో 14వ వేతన ఒప్పందానికి సంబంధించిన చర్చలను నిర్దీత కాలంలో పూర్తిచేయ లేదన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్టాలిన్ రవాణా కార్మికుల వేతన ఒప్పందంపై కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చించి, డిమాండ్ల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం పథకానికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2,800 కోట్లు, డీజిల్ రాయితీగా రూ.2000 కోట్లు, విద్యార్థుల ఉచిత ప్రయాణం కోసం రూ.1,500 కోట్లను సీఎం కేటాయించారని తెలిపారు. రవాణా ఉద్యోగులు అడగకుండానే దీపావళి బోనస్‌ను 20 శాతం పెంచి రూ.16,800 పంపిణీ చేశామని గుర్తు చేశారు. పదోన్నతి, వారసులకు ఉద్యోగాలు ఇస్తున్నామని, సంక్రాంతి సెలవుల అనంతరం మళ్లీ కార్మిక సంఘాల నేతలతో చర్చించి సమస్యలకు పరిష్కారం చేసేలా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. అప్పటివరకు కార్మికులు ఓపిక పట్టి ఆందోళన విరమించుకోవాలని మంత్రి శివశంకర్ కోరారు.

9 నుంచి సమ్మెబాట

రవాణా కార్మిక సంఘం ప్రకటన

ప్యారీస్, జనవరి 3: ప్రభుత్వ కార్మికుల సంక్షేమ శాఖతో నిర్వహించిన త్రైపాక్షిక చర్చలు విఫలం కావడంతో ఈ నెల 9 నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు ప్రభుత్వ రవాణా కార్మిక సంఘం ప్రకటించింది. సమాన పనికి సమాన వేతనం, వేతనం పెంపు, ఖాళీ పోస్టుల భర్తీ, మృతిచెందిన ఉద్యోగుల వారసులకు కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగం తదితర ఆరు డిమాండ్లను నెరవేర్చాలంటూ సీఐటీయూ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, అన్నా కార్మిక సంఘాలు ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించుకున్నాయి. వీటిపై బుధవారం స్థానిక తేనాంపేటలోకి ప్రభుత్వ కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన చర్చల్లో పాల్గొన్న అధికారులు, రవాణా కార్మిక సంఘాల ప్రతినిధులతో సుమారు నాలుగు గంటలు సమావేశమై చర్చించారు. అయితే ఈ చర్చలు విఫలం కావడంతో ఈ నెల 9 నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సౌందర్‌రాజన్ ప్రకటించారు.

పొంగల్ సరుకుల కొనుగోళ్లకు అనుమతి

రూ.238.92 కోట్ల నిధుల మంజూరు ● నగదు కానుకపై త్వరలో ప్రకటన



చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతిని పురస్కరించుకుని రేషన్‌కార్డుదారులందరికీ పొంగల్ సరుకులను పంపిణీ చేయడానికి సహకార, ఆహార శాఖ ఉన్నతాధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. కార్డుదారులకు ఉచితంగా ఇచ్చే పచ్చిబియ్యం, చక్కెర, చెరకు గడను బహిరంగ మార్కెట్లలో, చెరకు రైతుల సహకార సంఘాలలో కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అనుమతిని జారీ చేసింది. పొంగల్ సరకుల కొనేందుకు ప్రభుత్వం రూ.238.92 కోట్ల నిధులను మంజూరు చేసింది.

రాష్ట్రంలో సంక్రాంతి సందర్భంగా యేటా రేషన్‌దుకాణాల్లో కిలో పచ్చిబియ్యం, కిలో చక్కెర, చెరకు గడ, రూ.1000 నగదును కానుకగా పంపిణీ చేయడం ఆనవాయితీ. సంక్రాంతి నెల రోజులకు ముందే అంటే డిసెంబర్ మొదటి వారంలోనే ఈ సంక్రాంతి కానుకల పంపిణీ ఏర్పాట్లు చేపడుతుంటారు. అయితే ఈ యేడాది డిసెంబర్ మొదటివారంలో చెన్నై సహా నాలుగు జిల్లాల్లో తుఫాను తాకిడి కుండపోత వర్షాలు, రెండో వారంలో తూత్తుకుడి సహా నాలుగు జిల్లాల్లో వర్షబీభత్సం నెలకొనటంతో పొంగల్ కానుకలకు సంబంధించిన పనులు చేపట్టలేకపోయారు. రెవెన్యూ అధికారులంతా వర్ష, తుఫాను బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.6వేల వరద సాయం పంపిణీలో తలమునకలయ్యారు. ఎనిమిది జిల్లాల్లో ఈ వరద సాయాన్ని పంపిణీ చేయడానికి ఇతర జిల్లాల నుంచి కూడా సీనియర్ ఐఏఎస్ అధికారులను రప్పించారు. ఈ కారణాల వల్ల పొంగల్ కానుకగా ఇచ్చే సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో సహకార ఆహార వినియోగదారుల భద్రతా శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే గోపాల్ మంగళవారం రాత్రి పొంగల్ కానుక వస్తువుల వివరాలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. సంక్రాంతి సందర్భంగా రేషన్‌కార్డుదారులకు శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రాలలో బస చేస్తున్నవారికి పండుగలో చక్కెర పొంగలి తయారీకి అవసరమైన బియ్యం, చక్కెరను, చెరకు గడను పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి జారీ చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 2 కోట్లా 19లక్షలా 57 వేలా402 మంది రేషన్‌కార్డుదారులకు ఈ పొంగల్ కానుక సరుకులను పంపిణీ చేయడానికిగాను రూ.238కోట్లా 92లక్షలా 72 వేలా 741 నిధులు మంజూరుకు కూడా ప్రభుత్వం అనుమతించింది. బహిరంగ మార్కెట్‌లో కలో పచ్చి బియ్యాన్ని జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య నిర్ధారించిన రూ.33.20లకు కొనుగోలు చేసి వాటిని రేషన్‌షాపులకు తరలించనున్నట్లు పేర్కొన్నారు. ఇదే విధంగా కిలో చక్కెరను రూ.40.61, చెరకు గడను రూ.33 చొప్పున కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అనుమతించిందని ఆయన తెలిపారు. బుధవారం నుంచి పచ్చిబియ్యం, చక్కెర, చెరకుగడల కొనుగోళ్లు ప్రారంభమైందన్నారు. వచ్చేవారం రేషన్‌షాపుల్లో ఈ పొంగల్ సరకులను పంపిణీ చేసే అవకాశం ఉందని చెప్పారు. పంపిణీకి సంబంధించి అన్ని జిల్లాల్లో కలెక్టర్ల నాయకత్వంలో కమిటీలు ఏర్పాటవుతాయన్నారు. ఈ పొంగల్ సరకులను టోకెన్ల పద్ధతిలో పంపిణీ చేయాలా అనే విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఇక పొంగల్ నగదు కానుకగా రూ.1000 పంపిణీ చేసే విషయంపై త్వరలోనే ప్రభుత్వం ప్రకటన జారీ చేస్తుందన్నారు. తొలుత పొంగల్ సరుకులను సిద్ధం చేయడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ సరకులన్నీ రేషన్‌షాపులకు చేరిన తర్వాత నగదు పంపిణీపై ప్రకటన చేసి, వాటిని కార్డుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలా? లేక వరదసాయం నగదును పంపిణీ చేసినట్లు రేషన్‌షాపులలోనే పంపిణీ చేయాలా? అనే విషయంపై కూడా ప్రభుత్వం త్వరలోనే ప్రకటన జారీ చేస్తుందన్నారు. ఈ నగదు కానుకకు సంబంధించి త్వరలోనే ముఖ్యమంత్రి స్టాలిన్ అధికారులతో సమావేశం జరిపిన మీదట ప్రకటిస్తారని సచివాలయ అధికార వర్గాలు చెబుతున్నాయి.

చీరలు, ధోవతులు సిద్ధం

పెరంబూర్, జనవరి 3: పొంగల్ పండుగ సందర్భంగా రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు అందించేందుకు 3.31 కోట్ల చీరలు, ధోవతులు సిద్ధం చేసినట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎమ్మార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ... పొంగల్‌కు ఉచితంగా అందించేందుకు 1.68 కోట్ల చీరలు, 1.63 కోట్ల ధోవతులు సిద్ధంగా ఉంచామన్నారు. వీటిలో 15 రకాల చీరలు, 5 రకాల ధోవతులు ఉన్నాయని మంత్రి తెలిపారు.



ధర్నాలో రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్, నేతలు, కార్యకర్తలు

వరద నిధులు విడుదల చేయాలని శాస్త్రిభవన్ ఎదుట సీపీఎం ధర్నా

● బాలకృష్ణన్ సహా 600 మంది అరెస్ట్

పెరంబూర్, జనవరి 3: రాష్ట్రప్రభుత్వం కోరిన వరద సాయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా జరిగింది. నుంగంబాక్కంలోని శాస్త్రి భవన్ ఎదుట చేపట్టిన ధర్నాకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విపత్తులతో నష్టపోయిన రాష్ట్రాలను ఆదుకోవడం కేంద్రప్రభుత్వం బాధ్యత అన్నారు. కానీ, ప్రస్తుత బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు నిధులు అందజేయడంలో పక్షపాతం చూపుతోందని మండిపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధికంగాను, బీజేపీ రహిత రాష్ట్రాలకు తక్కువగా నిధులు కేటాయిస్తోందన్నారు. విపత్తులకు నష్టపోయిన రాష్ట్రాలకు ఆదుకోవడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. 'మిచౌంగ్' తుఫాను కారణంగా చెన్నై సహా నాలుగు జిల్లాలు, భారీవర్షాల కారణంగా తూత్తుకుడి, తిరునల్వేలి సహా నాలుగు జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. తుఫాను, భారీవర్షాల బాధిత ప్రాంతాలను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, కేంద్ర బృందం పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారన్నారు. ఊహించని విధంగా జరిగిన ఈ విపత్తు నుంచి ప్రజలను, బాధిత జిల్లాల్లో సహాయక చర్యలకు రూ.21,000 వేల కోట్లు అందించాలని రాష్ట్రప్రభుత్వం విన్నవించినా, ఇప్పటివరకు కేంద్రం ఎలాంటి ఎలాంటి సాయం అందించలేదన్నారు. అదే సమయంలో వరద బాధింపులపై కూడా కేంద్ర మంత్రులు రాజకీయాలు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇకనైనా కేంద్రం స్పందించి సత్వరం రాష్ట్రానికి నివారణ నిధులు అందించాలని బాలకృష్ణన్ డిమాండ్ చేశారు. ధర్నాలో భాగంగా నిధులు అందించాలి, బీజేపీ రహిత రాష్ట్రాలపై కేంద్రప్రభుత్వం పక్షపాత ధోరణి విడనాడాలని కోరుతూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నా కారణంగా శాస్త్రిభవన్ రోడ్డు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, 100 మంది మహిళలు సహా 600 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

నారాయణి పీఠం సేవలు ప్రశంసనీయం

● శక్తి అమ్మ జయంతి వేడుకల్లో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



శక్తి అమ్మ ఆశీస్సులందుకుంటున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ తదితరులు



శక్తి అమ్మకు పుష్పాలతో అభిషేకం

వేలూరు, జనవరి 3: శక్తి అమ్మ సారథ్యంలో నారాయణి పీఠం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కొనియాడారు. స్థానిక అరియూర్ స్వర్ణాలయం స్థాపకుడు, నారాయణి పీఠం పీఠాధిపతి శక్తి అమ్మ 48వ జయంతి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. వేడుకల్లో జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, ఎమ్మెల్యే నందకుమార్, కార్పొరేషన్ మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి కోవింద్ మాట్లాడుతూ... స్వర్ణాలయం ప్రపంచంలోనే పెద్ద ఆలయంగా పేరుగాంచిందన్నారు. ఇక్కడ ఆధ్యాత్మిక సేవలతో పాటు పర్యావరణం, వైద్యం, విద్యాభివృద్ధికి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేవలందించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ సందర్భంగా టీటీడీ తరఫున ప్రసాదం అందజేసి, వేదమంత్రాలు చదివి శక్తి అమ్మను ఆశీర్వదించారు. వేడుకల్లో భాగంగా నారాయణి పీఠంలో తెల్లవారుజామున 5 గంటలకు గణపతి హోమం, శ్రీ నారాయణి మూలమంత్ర హోమం, ఆయుష్య హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు శక్తి అమ్మ వేదికపైకి చేరుకోగా పుష్పాలతో అభిషేకం చేసి, హారతులు అందజేశారు. అనంతరం కలశ నీరు శక్తి అమ్మపై చల్లి, పాద పూజలు చేశారు. వేడుకల్లో వేలసంఖ్యలో భక్తులు పాల్గొని శక్తి అమ్మకు పాదాభివందనం చేసి ఆశీస్సులు అందుకున్నారు. భక్తులకు పీఠం తరఫున అన్నదానం చేశారు.

మంత్రి ఉదయనిధి ఢిల్లీ పయనం

నేడు ప్రధాని మోదీతో భేటి

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి బుధవారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. గురువారం ఉదయం ఆయన ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీని కలుసుకోనున్నారు. రాష్ట్రంలో ఈనెల 19న ఖేలో ఇండియా క్రీడా పోటీలు ప్రారంభమవుతున్నాయి. చెన్నై, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి నగరాల్లో ఈ క్రీడా పోటీలు జరుగుతాయి. ఈనెల 19 నుంచి 31వ తేదీ వరకు ఈ పోటీలు కొనసాగుతాయి. ఈ పోటీల్లో 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. 18 యేళ్లలోపు క్రీడాకారులు సుమారు 5500 మంది ఈ పోటీల్లో ప్రాతినిధ్య వహిస్తారు. వీరితోపాటు 1600 మంది కోచ్‌లు కూడా హాజరవుతున్నారు. ఈ పోటీల ముగింపు వేడుకలు చెన్నైలో భారీ యెత్తున నిర్వహించాలని మంత్రి ఉదయనిధి, పోటీల నిర్వాహకులు నిర్ణయించారు. ఆ మేరకు ఈ పోటీల ముగింపు ఉత్సవాలకు ప్రధానమంత్రిని ఆహ్వానించేందుకు ఉదయనిధి సాయంత్రం 5.15 గంటలకు విస్తారా విమానంలో ఢిల్లీకి వెళ్లారు. ఆయనతోపాటు క్రీడా శాఖ ఉన్నతాధికారులు అతుల్యమిశ్రా, మేఘనాథరెడ్డి వెళ్లారు. అంతకు మునుపు నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీని కలుసుకుని రాష్ట్రంలో తుఫాను, వర్షబీభత్సాలను జాతీయ విపత్తుగా ప్రకటించి భారీగా నిధులు కేటాయించాలని కోరనున్నట్లు తెలిపారు. తిరుచ్చిలో జరిగిన సభలో ప్రధాని మోదీ ఈ మేరకు కేంద్రం అండగా ఉంటుందని భరోసా ఇచ్చిన నేపథ్యంలో నిధులను త్వరగా విడుదల చేయమని కోరుతానని చెప్పారు.

తిరువాన్మియూరు, ఈంజంబాక్కంలో

తీరానికి కొట్టుకువస్తున్న తాబేళ్ల కళేబరాలు

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువాన్మియూరు, ఈంజంబాక్కం సముద్రతీరాల్లో తాబేళ్ల కళేబరాలు కొట్టుకువస్తుండడంతో స్థానికులు, తాబేళ్ల సంరక్షణ సంస్థల నిర్వాహకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మిచౌంగ్ తుఫాను కారణంగా ఎన్నూరులోని చమురు సహా ఇతర కర్మాగారాల నుండి వెలువడిన వ్యర్థాల కారణంగా సముద్రంలో ఏర్పడిన తెట్టు వల్లే ఈ తాబేళ్లు మృతిచెంది ఉంటాయని స్థానికులు అనుమానిస్తున్నారు. గత మూడు రోజులుగా ఆ రెండు సముద్రతీరాలకు మృతి చెందిన తాబేళ్లు కొట్టుకువచ్చాయి. బుధవారం ఉదయం తిరువాన్మియూరు తీరానికి మృతి చెందిన నాలుగు తాబేళ్లు, ఈంజంబాక్కం తీరానికి మూడు తాబేళ్ల కళేబరాలు, పాలవాక్కం తీరానికి రెండు తాబేళ్ల కళేబరాలు చొప్పున కొట్టుకువచ్చాయి. దీంతో తాబేళ్ల సంరక్షణ సంస్థ నిర్వాహకులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. యేటా జనవరి నుండి మే నెల దాకా తాబేళ్ల సంతానోత్పత్తి కాలం. ఆ నెలల్లో తాబేళ్లు తీరానికి వచ్చి గుడ్లు పెట్టడం వాటిని తాబేళ్ల సంరక్షణ సంస్థల నిర్వాహకులు, పర్యావరణ ప్రేమికులు, అటవీ శాఖ అధికారులు సేకరించి పొదిగించి సముద్రంలో విడిచిపెడుతుంటారు. ప్రస్తుతం తాబేళ్ల సంతానోత్పత్తి కాలం ప్రారంభం కాగానే వాటి కళేబరాలు తీరానికి కొట్టుకువస్తుండటంపై పరిశోధనలు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ట్రీ ఫౌండేషన్ సభ్యుడు మాట్లాడుతూ... గుడ్లు పెట్టేందుకు వచ్చే తాబేళ్ల కోసం ఎదురు చూస్తుంటే బుధవారం ఉదయం పనయూరు సముద్రతీరంలో ఓ పెద్ద తాబేలు కళేబరం కొట్టుకువచ్చిందని తెలిపారు. ఆ దృశ్యం చూసి తాము దిగ్భ్రాంతికి గురయ్యామని చెప్పారు. బిసెంట్‌నగర్, పళవేర్కాడు, ఈంజంబాక్కం, కోవళం తీరాల వద్ద సముద్రపు తాబేళ్ల గుడ్లను పొదిగించే ప్రాంతాలను కూడా సిద్ధం చేసి ఉంచామని, ఇక తాబేళ్ల రాకే తరువాయి అని చెప్పారు. చమురు తెట్టు కారణంగా సముద్రపు తాబేళ్లు మృతి చెంది ఉంటాయని అనుమానిస్తున్నామని పేర్కొన్నారు.

రామానుగ్రహం వల్లే అయోధ్యలో ఆలయం

● సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పరాశరన్

● చెన్నై టీటీడీ ఆలయంలో విశేషపూజలు

ప్యారీస్, జనవరి 3: దశరథ మహారాజు, కౌసల్య దంపతుల తనయుడు రామచంద్రుడి అనుగ్రహం వల్లే అయోధ్యలో రామమందిరం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఆధ్యాత్మిక శోభతో నిర్మితమైందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ మెంబర్ కె.పరాశరన్ పేర్కొన్నారు. అయోధ్యలో ఈనెల 22వ తేది రామ్‌జన్మభూమి క్షేత్ర ప్రాణప్రతిష్ఠ వేడుకలు నిర్వహించనున్న సందర్భంగా టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులోని టీటీడీ వెంకటేశ్వర ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన భారీ శ్రీరాముడి విగ్రహాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఆ సమయంలో భక్తుల 'జై శ్రీరామ్... గోవింద నామస్మరణ'తో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ముఖ్యఅతిథిగా పరాశరణ్, విశిష్ట అతిథిగా విశ్వహిందూ విద్యా కేంద్ర అధ్యక్షుడు ఎస్.వేదాంతం తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏజే శేఖర్ స్వాగతోపన్యాసం చేస్తూ... అయోధ్య పుణ్యక్షేత్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన రామమందిరం ప్రాణప్రతిష్ఠ వేడుకలు విజయవంతం కావాలన్న ఆకాంక్షతో టీటీడీ ఆలయంలో ఈనెల 26వ తేది వరకు ప్రత్యేక పూజలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అనంతరం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పరాశరన్ మాట్లాడుతూ... రామావతార విశిష్టతను విశ్వవ్యాప్తం చేయడమే రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ లక్ష్యమన్నారు. శాస్త్రాలు, ధర్మాలు, సమాజాభివృద్ధికి తోడ్పడతాయని, ప్రతి ఒక్కరిని మంచి మార్గంలో నడిపించే దివ్య అంశాలన్నారు. నిత్యం రామాయణం పఠిస్తే పుణ్యఫలం దక్కుతుందని, ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలు విజయవంతం కావాలని టీటీడీ ఆలయ స్థానిక సలహా మండలి అధ్యక్షులు ఏజే శేఖర్ నేతృత్వంలోని బృందం చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం తృప్తికరంగా ఉందన్నారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త వేలుకుడి కృష్ణన్ "అయోధ్యలో శ్రీరామ అవతారం' అనే అంశంపై ఉపన్యసించారు. రామాయణంలోని బాలకాండ, సుందరకాండ, అరణ్యకాండలను చదవడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుందన్నారు. 50 ఏళ్ల న్యాయపోరాటం ద్వారా రామచంద్రమూర్తి పుట్టింది అయోధ్యలోనే అని అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సలహా మండలి ఉపాధ్యక్షులు, సభ్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, భక్తులు



శ్రీరాముడి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పరాశరన్, వేదాంతం, ఏజే శేఖర్ తదితరులు

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జనవరి 3: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ తెలిపిన ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు తెలిపింది. ● **తండయార్‌పేట:** మేలూరు, మీంజూరు టౌన్, తేరడి వీధి, సూర్య నగర్, పీటీఓ కార్యాలయం, సీమావరం, పుదుపేడు, నందియంబాక్కం, పట్టమందిరి, వల్లూరు, అత్తిపట్టు, ఎస్సార్ పాళయం, కొండక్కరై, కరయాన్‌మేడు ● **అడయార్:** ఇంజంబాక్కం 1వ అవెన్యూ, వెట్టువాంగేణి, అక్కరై విలేజ్, అల్లికుళం, అంబేడ్కర్ వీధి, అన్నా ఎన్‌క్లేవ్, బెతేల్ నగర్ నార్త్, సౌత్ వీధులు, భారతి అవెన్యూ, బృందావన్ నగర్, కాపర్ బీచ్ రోడ్డు, ఈసీఆర్ గంగై అమ్మన్ ఆలయ వీధి, గుణాళ్ గార్డెన్, హనుమాన్ కాలనీ, కక్కన్‌వీధి, కస్తూర్బాయి నగర్, ఎల్లీ అవెన్యూ, నయినార్‌కుప్పం, ఉద్దండి, నీలాంగరై కుప్పం, పల్లవన్‌నగర్, పనయూర్ కుప్పం, పొన్నియమ్మన్ ఆలయ వీధి, రాజన్ నగర్ 12 వీధులు, రాయల్ ఎన్‌క్లేవ్, సెల్వ నగర్, టీవీఎస్ అవెన్యూ, తిరువళ్లువర్ రోడ్డు, వాపూసీ వీధి, విమల గార్డెన్.

నేడు చెన్నైకి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

పెరంబూర్,జనవరి3:బీజేపీ చేపట్టిన'ఇండియా సంకల్ప యాత్ర'లో పాల్గొనేందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం చెన్నైకి రాను న్నారు. స్థానిక కోడంబాక్కం ఐదు లైట్ల కూడలిలో గురువారం మధ్యాహ్నం నిర్వహించనున్న కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర నేతలు ప్రకటించారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జనవరి 3: స్థానిక అడయార్ మండల పరిధిలో విద్యుత్ గ్రీవెన్స్ గురువారం జరగనుంది. వేళచ్చేరి మెయిన్ రోడ్డులో ఉన్న ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు జరిగే గ్రీవెన్స్‌లో, వినియోగదారులు పాల్గొని విద్యుత్ సమస్యలు, బిల్లులు, ఇతర సేవలకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

వృత్తి శిక్షణ కేంద్రాల ప్రారంభానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జనవరి 3: కొత్త వృత్తి శిక్షణ కేంద్రాలు ప్రారంభించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉద్యోగ అవకాశాలు, వృత్తి శిక్షణ కమిషనర్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి కొత్త వృత్తి శిక్షణ కేంద్రాల ప్రారంభం, అంగీకారం రెన్యువల్ చేసుకోవడం, కొత్త శాఖలు ప్రారంభించడం, అదనపు యూనిట్లు ప్రారంభం తదితరాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. దరఖాస్తు రుసుము రూ.5 వేలు, పరిశోధన రుసుము రూ.8 వేలు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఔత్సాహికులు ఫిబ్రవరి 29వ తేదిలోపు www.skilltraining.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 044-22501006 అనే నెంబరు సంప్రదించవచ్చు.

కశ్మీర్ పండిట్ల భవిష్యత్తుపై ఉపన్యాసం

ఐసిఎఫ్, జనవరి 3: కశ్మీర్ ఖ్యాతిని వివరించే కార్యక్రమంలో భాగంగా 'నేటి కశ్మీర్, కశ్మీర్ పండిట్ల భవిష్యత్తు' అనే శీర్షికపై 95వ ఉపన్యాసం శనివారం రాత్రి 7 గంటలకు జరగనుంది. కంచి మఠం ఆధ్వర్యంలో 14 రోజులకు ఒకసారి ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. శనివారం జరగనున్న ఉపన్యాస కార్యక్రమంలో భారత, అమెరికా స్నేహ మండలి కౌన్సిల్ సభ్యుడు జీవన్ జెడ్సీ వక్తగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాన్ని నేరుగా వీక్షించలేని వారు మాధ్యమ ధర్మసమాజం యూట్యూబ్, కామకోటి టీవీ, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి వాటిలో వీక్షించవచ్చు.

6న మారథాన్ పోటీలు

ఐసిఎఫ్, జనవరి 3: వ్యాయామంపై అవగాహన కల్పించేలా చెన్నై రన్నర్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేది చెన్నై మారథాన్ పోటీలు జరుగనున్నాయి. నేపియర్ బ్రిడ్జి నుంచి తరమణి వరకు 10 కి.మీ, నేపియర్ బ్రిడ్జి నుంచి ఈసీఆర్ సెమ్మంజేరి వరకు 32 కి.మీ, బిసెంట్‌నగర్ బీచ్ నుంచి సెమ్మంజేరి వరకు 21 కి.మీ అని మూడు విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. మొత్తం 25 వేల మంది ఈ పోటీల్లో పాల్గొనున్నారు.

కలైసెమ్మల్ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జనవరి 3: సంప్రదాయ, ఆధునిక శైలి చిత్రకారులు, శిల్పులు 'కలైసెమ్మల్' పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలని కళలు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ తెలిపారు. చిత్రకారులు, శిల్ప కళాకారులను సన్మానించేలా యేటా ఆరుగురిని ఎంపిక చేసి తలా రూ.లక్ష నగదు, బహుమతి, పురస్కారాన్ని ప్రభుత్వం అందజేస్తోంది. 50 ఏళ్లకు పైబడిన చిత్రకారులు 'కమిషనర్, కళలు, సాంస్కృతిక శాఖ, తమిళ అభివృద్ధి కాంప్లెక్స్, రెండవ అంతస్తు, తమిళ్ సాలై, ఎగ్మూర్, చెన్నై-8' అనే చిరునామాలో ఈ నెల 20వ తేదిలోపు దరఖాస్తు సమర్పించాలి. ఇతర వివరాలకు నెం.044-28193157లో సంప్రదించవచ్చు.

పర్యావరణ పార్కుపై అభిప్రాయ సేకరణ

ఐసిఎఫ్, జనవరి 3: స్థానిక పెరుంగుడి డంపింగ్ యార్డ్‌లో పర్యావరణ పార్కు ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ ఈనెల 8వ తేది మేయర్ ప్రియ సమక్షంలో జరగనుంది. నగరంలో సేకరించే 5,100 మెట్రిక్ టన్నుల చెత్తను పెరుంగుడి, కొడుంగైయూర్ డంపింగ్ యార్డులకు తరలిస్తుంటారు. పెరుంగుడి యార్డులో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో వ్యర్థాలను రూ.354 కోట్లతో ఏర్పాటు చేసిన కేంద్రంలో బయోమైనింగ్ విధానంలో విభజించనున్నారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలో పర్యావరణ పార్కు ఏర్పాటుకు కార్పొరేషన్ నిర్ణయించింది. దీనిపై సోమవారం ఉదయం 11 గంటలకు పల్లికరనై ఐఐటీ కాలనీలోని కార్పొరేషన్ కమ్యూనిటీ హాలులో మేయర్ ప్రియ, కమిషనర్ రాధాకృష్ణన్ సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని జీసీసీ తెలిపింది.

తగ్గిన పప్పు ధరలు

ఐసిఎఫ్, జనవరి 3: క్రిస్మస్, ఆంగ్ల సంవత్సరాది పండుగల అనంతరం పప్పుల ధరలు తగ్గాయి. మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి, రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి నగరానికి పప్పులు దిగుమతి అవుతున్నాయి. పండుగలను పురస్కరించుకొని పప్పుధాన్యాలను కిలో రూ.10 నుంచి రూ.20కి అదనంగా విక్రయించారు. పండుగలు ముగియడంతో మళ్లీ వ్యాపారులు రూ.10 తగ్గించారు.

ఎంఫిల్ కోర్సులకు నిషేధం

ఐసిఎఫ్, జనవరి 3: కొత్త విద్యా విధానం ప్రకారం దేశవ్యాప్తంగా పీహెచ్‌డీ కోర్సులు మాత్రమే నిర్వహించాలని, ఎంఫిల్ కోర్సులు నిర్వహించరాదని యూజీసీ ఉత్తర్వులు జారీ చేసింది. గత విద్యా సంవత్సరం నుంచి ఎంఫిల్ కోర్సులకు నిషేధం అమలులో ఉంది. కొన్ని డీమ్డ్ వర్సిటీలు, స్వయం ప్రతిపత్తి కళాశాలలు ఎంఫిల్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు యూజీసీకి ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన యూజీసీ... ఏ కళాశాలల్లో ఎంఫిల్ కోర్సులు ప్రవేశపెట్టరాదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు చేపట్టనున్నట్లు యూజీసీ ఉత్తర్వులు జారీచేసింది.

తుఫాను బాధిత జిల్లాల జీవో విడుదల

పెరంబూర్, జనవరి 3: చెన్నై, తిరువళ్లూర్, చెంగల్పట్టు, కాంచీపురం తుఫాను బాధిత జిల్లాలుగా ప్రకటిస్తూ రాష్ట్ర గెజిట్‌లో వెలువరించారు. అలాగే, తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి, తెన్‌కాశి, రామనాథపురం, విరుదునగర్ తదితరాలు వరద బాధిత జిల్లాలుగా గెజిట్‌లో ప్రభుత్వం పేర్కొంది.

డీఎంకే మాజీ ఎమ్మెల్యే సెల్వం మృతి

● సీఎం స్టాలిన్ సంతాపం


కేకే సెల్వం(ఫైల్‌ఫొటో)


సెల్వం భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం స్టాలిన్, ఆయన సతీమణి దుర్గా స్టాలిన్, ఎంపీ టీఆర్ బాలు తదితరులు

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రధాన కార్యాలయ కార్యదర్శి, ఆ పార్టీ మాజీ శాసనసభ్యుడు కేకే సెల్వం మృతిచెందారు. ఆయన వయస్సు 70 సంవత్సరాలు గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ వచ్చారు. స్థానిక పోరూరు లోని శ్రీరామచంద్ర ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. బుధవారం ఉదయం చికిత్స ఫలించక ఆయన తుదిశ్వాస విడిచారు. 1997లో ఆయన అన్నాడీఎంకే నుండి వైదొలగి డీఎంకేలో చేరారు. ఆ తర్వాత 2016లో చెన్నై థౌజెండ్‌లైట్స్ నియోజకవర్గంలో పోటీ చేసి శాసనసభ్యుడిగా గెలిచారు. అప్పటి నుండి ఆయన పార్టీకి మెరుగైన సేవలందిస్తూ వచ్చారు. తనకు చెన్నై జిల్లా కార్యదర్శి పదవి వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. మాజీ శాసనసభ్యుడు టి.నగర్ అన్బళగన్ మృతి చెందినప్పుడు ఆయన నిర్వర్తిస్తూ వచ్చిన జిల్లా శాఖ అధ్యక్షపదవి వస్తుందని భావించారు. కానీ ఆ పదవి రాకపోవడంతో పార్టీ అధిష్ఠానంపై అలుకవహించి 2020లో ఉన్నట్టుండి బీజేపీలో చేరారు. రెండేళ్లపాటు బీజేపీలో కొనసాగిన సెల్వం మళ్లీ 2022లో డీఎంకే చేరారు. అటుపిమ్మట సెల్వం పార్టీ ప్రధాన కార్యాలయ కార్యదర్శిగా నియమితులయ్యారు. సెల్వం మృతి వార్త తెలియగానే పార్టీ ప్రముఖులు పూచ్చి మురుగన్, హార్బర్ ఖాజా తదితరులు ఆయన ఇంటికి వెళ్లి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా కేకే సెల్వం మృతి పట్ల తీవ్ర సంతాపం ప్రకటించారు. ఎంజీఆర్ మృతి తర్వాత సెల్వం అన్నాడీఎంకేని విడిచి డీఎంకేలో చేరి పార్టీ అభివృద్ధికి పాటుపడ్డారని, ఎల్లప్పుడూ అందరినీ చిరునవ్వుతోనే పలకరించేవారని పేర్కొన్నారు. సెల్వం మృతితో శోకతప్తులైన కుటుంబీకులకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు.

పుస్తకావిష్కరణకు పోలీసుల నిరాకరణ

● వర్శిటీ ప్రాంగణంలో ఉద్రిక్తత


పుస్తకావిష్కరణలో నిర్వాహకులు - పోలీసులతో నిర్వాహకుల వాగ్వాదం

వేలూరు, జనవరి 3: స్థానిక కాట్పాడి సమీపం సేర్కాడులో తిరువళ్లువర్ యూనివర్శిటీ పనిచేస్తోంది. ఈ వర్శిటీలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల తయారీలో చేతివాటం తదితరాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, వర్శిటీల్లో జరుగుతున్న అవినీతిపై భారతీయార్, పెరియార్, తిరువళ్లువర్ వర్శిటీల ఆధ్వర్యంలో 'తిల్లు ముల్లు' అనే పుస్తకం ముద్రించారు. ఈ పుస్తకాన్ని బుధవారం తిరువళ్లువర్ వర్శిటీ సమీపంలో ఆవిష్కరించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొని ఉద్రిక్తత నెలకొంది.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అప్పు

వేలూరు, జనవరి 3: అన్నాడీఎంకే పార్టీ అనుబంధ న్యాయవాదుల సంఘం ముద్రించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను వేలూరు మానగర జిల్లా అన్నాడీఎంకే సెక్రటరీ ఎస్సార్కే అప్పు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నిర్వాహకులు, న్యాయవాదుల విభాగం సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



వేలూరు, జనవరి 3: పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు 6,7 తరగతుల విద్యార్థులకు మూడో సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కాట్పాడి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సరళ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో టెక్నికల్ విద్య ఉపాధ్యాయుడు జనార్థనన్, ఉప ప్రధానోపాధ్యాయురాలు రోజ్‌లిన్ పొన్ని, ఉన్నత విద్య ఉప ప్రధానోపాధ్యాయుడు మారిముత్తు, తిరుమొళి, వ్యాయాయ శాఖ ఉపాధ్యాయులు కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి మంత్రి సెంథిల్‌బాలాజీ బెయిలు పిటిషన్

8న విచారణ



చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖలో ఉద్యోగాలు తీసిస్తానంటూ కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసగించారంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు నమోదు చేసిన అక్రమ నగదు బట్వాడా కేసులో అరెస్టయిన మంత్రి సెంథిల్‌బాలాజి మూడోసారి బెయిలు పిటిషన్ దాఖలు చేశారు. సెంథిల్ బాలాజి హైకోర్టులో, సుప్రీం కోర్టులో దాఖలు చేసిన బెయిలు పిటిషన్లు తోసివేతకు గురయ్యాయి. ఆరోగ్య కారణాలకు బెయిలు మంజూరు చేసే ప్రసక్తి లేదని ఆ రెండు న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. సరైన కారణాలతో బెయిలు కోసం దిగువ కోర్టును ఆశ్రయించాలంటూ సుప్రీంకోర్టు ఆయనకు సలహా ఇచ్చింది. ఆ మేరకు సెంథిల్‌బాలాజి సిటీ ప్రిన్సిపల్ కోర్టులో బెయిలు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ మేజిస్ట్రేట్ అల్లీ ఎదుట బుధవారం విచారణకు వచ్చింది. ఆ సందర్భంగా మంత్రి సెంథిల్‌బాలాజీ తరఫు న్యాయవాది హాజరై సుప్రీం కోర్టు సలహా మేరకే బెయిలు పిటిషన్ సమర్పించినట్లు తెలిపారు. దీంతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులకు మేజిస్ట్రేట్ ఉత్తర్వు జారీ చేశారు. కేసు తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి వాయిదా వేశారు.

అక్రమార్జన కేసు

సుప్రీంకోర్టులో మాజీ మంత్రి పొన్ముడి అప్పీలు



ప్యారీస్, జనవరి 3 : అక్రమార్జన కేసులో మద్రాసు హైకోర్టు విధించిన జైలు శిక్షను రద్దు చేయాలని కోరుతూ మాజీ మంత్రి పొన్ముడి సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లారు. గత 2006-11 మధ్య డీఎంకే ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన పొన్ముడి ఆదాయానికి మించి రూ.1.75 కోట్లను వెనకేసుకున్నారని రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయన సతీమణి విశాలాక్షిని కూడా చేర్చారు. తొలుత ఈ అక్రమార్జన కేసు విచారణ విల్లుపురం ప్రిన్సిపల్ క్రైం కోర్టులో జరిగింది. అటుపిమ్మట 2015లో ఆ కేసు విచారణను విల్లుపురం ఏసీబీ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. ఆ కేసుపై మేజిస్ట్రేట్ సుందరమూర్తి విచారణ జరిపి పొన్ముడి, ఆయన భార్యపై మోపిన అభియోగాలకు ఆధారాలు లేవంటూ నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించారు. ఆ తీర్పుపై ఏసీబీ హైకోర్టు అప్పీలు పిటిషన్ దాఖలు చేసింది. ఈ అప్పీలుపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జయచంద్రన్ గత డిసెంబర్ 21న తీర్పు వెలువరించారు. పొన్ముడి, ఆయన సతీమణి విశాలాక్షి అక్రమార్జనలకు పాల్పడినట్లు సాక్ష్యాధారాలతో రుజువు కావటంతో ఇరువురికీ మూడేళ్ల జైలు శిక్ష,రూ.50లక్షల జరిమాన విధించారు. తీర్పుపై పొన్ముడి అప్పీలుకు వెళ్లేందుకు అనువుగా శిక్షను నెల రోజులపాటు నిలిపి ఉంచుతూ న్యాయమూర్తి ఉత్తర్వు జారీ చేశారు. హైకోర్టు వెలువరించిన ఈ తీర్పును సవాలు చేస్తూ పొన్ముడి తరఫున అప్పీలు పిటిషన్ బుధవారం ఉదయం దాఖలైంది.

ఆరణిలో 'ప్రజలతో ముఖ్యమంత్రి'


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

పెరంబూర్, జనవరి 3: తిరువళ్లూర్ జిల్లా పొన్నేరి తాలూకా ఆరణి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం 'ప్రజలతో ముఖ్యమంత్రి' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పొన్నేరి కాంగ్రెస్ ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్, గుమ్మిడిపూండి డీఎంకే ఎమ్మెల్యే టీజే గోవిందరాజన్ పాల్గొని ప్రజలనుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ వినతిపత్రాలను పరిశీలించి సత్వరం పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ డిప్యూటీ ఛైర్మన్ జయకుమార్, ఆరణి మున్సిపాలిటీ ఛైర్మన్ రాజేశ్వరి, మున్సిపాలిటీ కార్యనిర్వహణ అధికారి (బాధ్యత) అర్జునన్, ఉప కార్యదర్శి సుకుమారన్, ఆరణి డీఎంకే నగర కార్యదర్శి ముత్తు, మాజీ కార్యదర్శి కౌన్సిలర్ కన్నదాసన్, ఆరణి డీఎంకే కోశాధికారి కరికాలన్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

విల్లుపురంలో కొట్రవై దేవతా విగ్రహం లభ్యం


కొట్రవై దేవతా విగ్రహం

ఐసిఎఫ్, జనవరి 3: విల్లుపురం జిల్లాలో పల్లవుల కాలం నాటి కొట్రవై దేవతా విగ్రహం బయల్పడింది. విల్లుపురం నుంచి తిరుకోవిలూర్ వెళ్లే మార్గం లో 5వ కి.మీలో ఉన్న పెరుంబాక్కంలో 8వ శతాబ్దానికి చెందిన పల్లవుల కాలం నాటి ఈ విగ్రహన్ని అరుప్పుకోట చరిత్ర పరిశోధకుల బృందం కనుగొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న జామ తోటలో ఓ చెట్టు కింద 5 అడుగుల ఎత్తు, 3 అడుగుల వెడల్పు కలిగిన రాతిపై మలచిన విగ్రహన్ని గుర్తించారు. దేవతా విగ్రహంపై కిరీటం, చెవులకు తాటి ఆకుల కుండలాలు, మెడలో హారం, తాళిలో పులి దంతం, చేతుల్లో వివిధ రకాల ఆయుధాలు ఉన్నాయని, దున్న శిరస్సుపై నిల్చున్న భంగిమలో కొట్రవై దేవత ఉందని పరిశోధకులు వివరించారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమమే లక్ష్యం

● ఏఐఎస్ఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్


ఏఐఎస్ఎంసీ జాతీయ నాయకులను సత్కరిస్తున్న కుమార్

ప్యారీస్, జనవరి 3: పారిశుధ్య కార్మికుల సంక్షేమమే లక్ష్యమని ఆ లిండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ (ఏఐ ఎస్ఎంసీ) తమిళనాడు అధ్యక్షుడు కె.కుమార్ పేర్కొన్నారు. జనగాంలోని గోదావరి ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో మంగళవారం ఉదయం ఏఐఎస్ఎంసీ వర్కింగ్ కమిటీ నిర్వాహకుల సమావేశం జరిగింది. యూనియన్ మహారాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ అన్నాచాంగ్రే నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశంలో మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు వి.పటేల్, మహారాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి సీఎం సుశీల్‌యుమార్ షిండే కుమార్తె ప్రకోతితాయ్ షిండే, సంఘ జాతీయ అధ్యక్షుడు చరణ్‌సింగ్ రాకే సహా తమిళనాడు అధ్యక్షుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్మికు లు, పారిశుధ్య కార్మికులు, రోజువారీ కూలీలు తదితరులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపిన కుమార్, అందరికి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

కామరాజర్ హార్బర్ కొత్త సరుకుల టెర్మినల్ ప్రారంభం

పెరంబూర్, జనవరి 3: ఎన్నూర్ కామరాజర్ హార్బర్‌లో రూ.206 కోట్లతో నిర్మించిన సరుకుల టెర్మినల్‌ను మంగళవారం తిరుచ్చిలో జరిగిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. 330 మీటర్ల పొడవు, 33 మీటర్ల వెడల్పుతో అత్యాధునిక వసతులతో ఈ టెర్మినల్ ఏర్పాటైందన్నారు. ఏడాదికి సుమారు 100 నౌకలు వచ్చేలా, ఒకటిన్నర లక్షల కార్లు ఎగుమతి చేసేలా ఈ కొత్త టెర్మినల్ ఏర్పాటైందని తెలిపారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి రావడంతో ఏడాదికి సుమారు 589 మిలియన్ మెట్రిక్‌టన్నుల సరుకు రవాణా జరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

అప్పీలు చేసుకున్న వారికి ఈ నెలలోపే మహిళా సాధికారిక నగదు

పెరంబూర్, జనవరి 3: మహిళా సాధికారిక నిధి పథకానికి అప్పీలు చేసుకున్న వారికి ఈ నెలలో నగదు అందజేయనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. మహిళలకు నెలకు రూ.1,000 అందించే కలైంజర్ మహిళా సాధికారిక నిధి పథకాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ పథకంలో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతినెలా 15వ తేది రూ.1,000 జమ చేస్తున్నారు. ఈ పథకం కోసం పలువురు దరఖాస్తు చేసుకోగా అవి తిరస్కరణకు గురయ్యారు. దీంతో, ప్రజల విజ్ఞప్తి మేరకు తిరస్కరణకు గురై అర్హులైన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో, 11.85 లక్షల మంది మళ్లీ దరఖాస్తులు సమర్పించగా, ఆ దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్లు అధికారులు చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు ఈనెల నుంచి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు, ఎంపికను వారి మొబైల్ నెంబర్లకు మెసేజ్ రూపంలో పంపించనున్నట్లు ప్రభుత్వ అధికారులు తెలిపారు. కాగా, ఈ పథకంలో కోటీ 13 లక్షలా 84 వేలా 300 మంది మహిళలకు నెలకు రూ.1,000 ప్రభుత్వం అందిస్తున్న విషయం తెలిసిందే.

సంక్రాంతి కానుకగా రూ.3 వేలు ఇవ్వాలి

● మాజీ సీఎం ఓపీఎస్ డిమాండ్

అడయార్, జనవరి 3: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రూ.3 వేల నగదు ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆయన బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేక జిల్లాల్లో అపారనష్టం వాటిల్లిందన్నారు. అందువల్ల ఈయేడాది సంక్రాంతి కానుకగా ప్రతిఒక్కకుటుంబానికి రూ.3 వేలు చొప్పున నగదు బహుమతి ఇవ్వాలని కోరారు. ప్రతి సంక్రాంతికి ప్రభుత్వం కిలో చొప్పున పచ్చిబియ్యం, కిలో చక్కెర, ఒక చెరకు గడతో పాటు రూ.వెయ్యి నగదును ఇస్తుంది. ఈ నగదును రూ.3 వేలుగా ఇవ్వాలని ఆయన కోరారు.

రెండో రోజూ కొనసాగిన ఐటీ సోదాలు

అడయార్, జనవరి 3: ఆదాయాన్ని తక్కువ చేసి చూపించి, పన్ను ఎగవేతకు పాల్పడినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత స్మారక మందిరాన్ని నిర్మించిన నిర్మాణ కంపెనీలో రెండో రోజైన బుధవారం కూడా ఐటీ అధికారుల సోదాలు కొనసాగాయి. మంగళవారం నుంచి చెన్నైతో పాటు రాష్ట్రంలో 30 చోట్ల ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా అన్నానగర్, ఎగ్మూరులో కార్యాలయాలు కలిగిన సీఎంకే భవన నిర్మాణ కంపెనీలో ఈ ఐటీ తనిఖీలు జరిగాయి. ఈ కంపెనీతోపాటు 30 చోట్ల రెండో రోజైన బుధవారం కూడా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లెక్కల్లో చూపని రూ.కోట్ల నగదు వివరాలను గుర్తించినట్టు సమాచారం. అలాగే, పన్ను ఎగవేతకు సంబంధించి కీలక దస్తావేజులను కూడా స్వాధీనం చేసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి.

పల్లవన్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి కుట్ర?

అడయార్, జనవరి 3: కడలూరు జిల్లా పెన్నాడం ప్రాంతంలో పల్లవన్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి గురయ్యేలా కొందరు దుండగులు కుట్రపన్నారు. సిమెంట్ స్లీపర్లు, రైలు పట్టాలు అనుసంధానం చేసే ఇనుప కొక్కీలను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. చెన్నై నుంచి తిరుచ్చి వైపు వెళ్ళే రైలు మార్గంలో పెన్నాడం వద్ద ఏకంగా 12 ఇనుప కొక్కీలను తొలగించారు. ఈ విషయాన్ని కొందరు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు, రైల్వే సిబ్బంది రైలు పట్టాలను తనిఖీ చేయగా, పెన్నాడం రైల్వే స్టేషన్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఈ కొక్కీలను తొలగించినట్టు గుర్తించారు. అదేసమయంలో ఆ మార్గంలో చెన్నై నుంచి కారైక్కుడికి వెళుతున్న పల్లవన్ ఎక్స్‌ప్రెస్‌ను కొద్దిసేపు నిలిపివేశారు. ఆ తర్వాత రైలు పట్టాలను సరిచేసిన తర్వాత పంపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

వైఎంసీఏ మైదానంలో బుక్ ఎగ్జిబిషన్ ప్రారంభం


బుక్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి

ప్యారీస్, జనవరి 3 : దక్షిణ భారత పుస్తక విక్రయదారులు, ముద్రణకర్తల సంఘం (బుక్ సెల్లర్స్ అండ్ పబ్లిషర్స్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియా -బాపాసీ) ఆధ్వర్యంలో చెన్నైలో ఏర్పాటు చేసిన 47వ పుస్తక ప్రదర్శనను బుధవారం రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి ప్రారంభించారు. స్థానిక నందనం వైఎంసీఏ గ్రౌండ్స్‌లో ఈ నెల 21 వరకు ఈ పుస్తక ప్రదర్శన కొనసాగుతుంది. ప్రారంభోత్సవంలో కలైంజర్ కరుణానిధి అవార్డులు, బాపాసీ అవార్డులను సాహితీవేత్తలకు, రచయితలకు మంత్రి ఉదయనిధి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అన్బిల్ మహేష్ పొయ్యామొళి, ఎం.సుబ్రమణ్యం, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఈడీ సమన్ల వ్యవహారం

రాష్ట్రపతికి జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ లేఖ

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భూ వివాదానికి సంబంధించిన న్యాయపరమైన కేసులో చిక్కుకున్న ఇద్దరు రైతులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారి ఒకరు జారీ చేసిన సమన్లలో వారి కులాలను ప్రస్తావించారంటూ రాష్ట్ర జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ పి.బాలమురుగన్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. సేలం జిల్లా ఆత్తూరుకు చెందిన రైతులు కన్నయ్యన్(72), కృష్ణన్‌కు 6.5 ఎకరాల భూములు ఉన్నాయి. ఆ భూముల వివాదానికి సంబంధించిన కేసులో ఆ ఇరువురికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ రితేష్ కుమార్ గత జూన్ 26న సమన్లు జారీ చేశారని, అందులో ఆ రైతుల కులాన్ని ప్రస్తావించారని పేర్కొన్నారు. ఆ సమన్ల ప్రకారం రితేష్‌కుమార్ అక్రమ నగదు బట్వాడా చట్టం కింద విచారణ జరుపుతున్నారు. రాష్ట్రంలోని నిరుపేద రైతులకు న్యాయం జరిగేందుకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనరేట్ స్వతంత్ర్య దర్యాప్తు సంస్థగా పనిచేసేలా కేంద్ర ఆర్థిక మంత్రిని వెంటనే పదవి నుండి తొలగించాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కూడా ఆ లేఖ ప్రతులను బాలమురుగన్ పంపారు.

న్యూ ఇయర్ వేడుకలు...

నిబంధనల ఉల్లంఘనపై 267 కేసుల నమోదు

వేలూరు, జనవరి 3: నూతన సంవత్సరం సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించినందుకు 267 కేసులు నమోదు చేశామని జిల్లా ఎస్పీ మణివన్నన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ... ప్రమాదరహిత నూతన సంవత్సర వేడుకలు జరుపుకొనేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక గస్తీ పనులు చేపట్టామన్నారు. గస్తీలో వేడుకల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించినందుకు వేలూరులో 112 కేసులు, కాట్పాడిలో 128 కేసులు, గుడియాత్తంలో 7 కేసులు నమోదుచేసి, 104 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

ద్రోహులకు గుణపాఠం చెప్పండి

● టీటీవీ దినకరన్ పిలుపు


సమావేశంలో ప్రసంగిస్తున్న టీటీవీ దినకరన్

వేలూరు, జనవరి 3: అన్నాడీఎంకేను ద్రోహుల నుంచి కాపాడేందుకు కార్య కర్తలు కృషి చేయాలని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పిలుపు నిచ్చారు. వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్, తిరువణ్ణామలై జిల్లాలకు చెందిన ఏఎంఎంకే కార్యదర్శులు, నిర్వాహకుల సమావేశం బుధవారం స్థానిక అన్నాసాలైలోని ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీవీ దినకరన్ మాట్లాడుతూ... కల్లబొల్లి హామీలతో అధికారం చేపట్టిన డీఎంకే, ప్రజలను మభ్యపెట్టే ప్రకటనలు చేస్తోందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వంతో కలసి పని చేస్తున్నామని, రాబోయే పార్లమెంటు ఎన్నిక ల్లోనూ ఇద్దరం కలసి పనిచేస్తామన్నారు. తుఫాను బాధితులను ఆదుకొనేలా కేంద్రప్రభుత్వం సహాయాలు అందించాలని దినకరన్ డిమాండ్ చేశారు.

ప్రజావిజ్ఞప్తుల దినంలో సిటీ పోలీసు కమిషనర్

9 మంది సీనియర్ సిటిజన్ల సమస్యలకు పరిష్కారం


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సందీప్‌రాయ్ రాథోడ్

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూరులో గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్‌లో బుధవారం ఉదయం ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహించారు. పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ పాల్గొని తొమ్మిది మంది సీనియర్ సిటిజన్ల కు సంబంధించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా 28 విజ్ఞప్తులను పరిశీలించి వాటిని వీలైనంత త్వరగా పరిష్క రించమంటూ ఆయా ప్రాంతాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులకు ఉత్తర్వు జారీ చేశారు. క్లాటిస్ సింగ్ (82), దేవరాజ్ (82) అనే ఇద్దరు వృద్ధులకు సంబంధించిన కుటుంబ తగాదా ఇతర సమస్యలను స్వయంగా వెళ్లి పరిష్కరించమంటూ ఆయా ప్రాంతాలకు చెందిన పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు.

సర్వీస్ రోడ్డులో బస్సులు నడపొద్దు

● కిళంబాక్కంవాసుల ధర్నా


ధర్నా చేస్తున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కిళంబాక్కంలోని కలైంజర్ సెంటినరీ బస్ టెర్మినల్ నుంచి పలు నగరాలకు వెళ్లే బస్సులను అక్కడి సర్వీసు రోడ్డు మీదుగా నడుపకూడదంటూ వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బుధవారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఆ బస్ టెర్మినల్ నుంచి సర్వీసు రోడ్డు మీదుగా వెళుతున్న బస్సును అడ్డుకుని నినాదాలు చేశారు. కిళంబాక్కం బస్ టెర్మినల్ నుంచి బయలుదేరే బస్సులన్నీ అక్కడి సర్వీసు రోడ్డు మీదుగా చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిలో వెళుతున్నాయి. అయితే సర్వీసు రోడ్డు ప్రాంతంలో ప్రైవేటు, సీబీఎస్ఈ పాఠశాలలున్నాయి. ఆ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానికులు రోజూ ఉదయం, సాయంత్రం అంటూ రెండు పూటలా వెళుతుంటారు. ఈ పరిస్థితులలో ఆ సర్వీసురోడ్డులో వేగంగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సుల కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ధర్నా, రాస్తారోకో జరిపారు.

బహిరంగ ప్రాంతాల్లో మాస్కులు ధరించండి

● మంత్రి సుబ్రమణ్యం

పెరంబూర్, డిసెంబరు 3: ఇతర అనారోగ్య సమస్యలున్న బాధితులు బహిరంగ ప్రాంతాల్లో మాస్కు ధరించాలని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో జేఎన్-1 కరోనా వైరస్ లక్షణాలు 30 మందికి నిర్ధారణ అయ్యాయన్నారు. ఈ రకం వైరస్ ప్రమాదకరం కాదని, నాలుగు రోజుల్లో ఆరోగ్యవంతులవుతారని, అందువల్ల ప్రజల భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. తుఫాను, వరద బాధిత జిల్లాల్లో వైరల్ జ్వరాలు, ఇతర అంటు వ్యాధులు ప్రబలలేదని మంత్రి సుబ్రమణ్యం తెలిపారు.



'కుంభారి'లో ఓ విజయ్ విశ్వ - మహానా

'కుంభారి' కథ ఏంటి... ప్రేక్షకులకు నచ్చిందా?

విజయ్ విశ్వ, మహానా, శరవణన్, నలీప్ జీవా, జాన్ విజయ్, శ్యామ్స్, మధుమిత తదితరులు నటించిన 'కుంభారి' సినిమా తాజాగా విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. కెవిన్ జోసెఫ్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, 'కన్నియాకుమారి బ్యాక్‌డ్రాప్‌లో ఈ కథ సాగుతుంది. కేబుల్ టీవీ ఆపరేటర్‌గా హీరో విజయ్ విశ్వ, మత్స్యకారుడైన నలీప్‌జియా నటించారు. వీరిద్దరు ప్రాణస్నేహితులు. ఆ గ్రామానికి చెందిన మహానాను హీరో ప్రేమిస్తాడు. తన స్నేహితుడికి ప్రేమలో సాయం చేస్తూ, వారిద్దరినీ ఒక్కటి చేసేందుకు నలీప్ జియా ప్రయత్నిస్తుంటాడు. ఈ ప్రేమజంటను విడదీసేందుకు హీరో అన్న జాన్ విజయ్ తన అనుచరులతో కలిసి కుట్రలు పన్నుతుంటాడు. ఈ క్రమంలో ముఠా చేతికి చిక్కకుండా ప్రేమ జంట ఊరు వదిలి వెళ్లిపోతుంది. అయితే, తన స్నేహితుడిని ఈ ముఠా హత్య చేసిందని భావించి, కోర్టును ఆశ్రయిస్తాడు. ఆ తర్వాత ఏం జరిగింది? ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకున్నాడా? జాన్‌విజయ్ ఏం చేశాడు? అన్నదే ఈ చిత్ర కథ. స్నేహం, ప్రేమ, అన్నాచెల్లి అనుబంధం అనే మూడు అంశాలను ఇతివృత్తంగా చేసుకుని తెరకెక్కించారు. మధుమిత, శామ్స్ హాస్యం ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుంది. కన్నియాకుమారి జిల్లాలోని పలు ప్రదేశాలను కెమెరామెన్ ప్రసాద్ ఆరుముగం ఎంతో అందంగా చూపించారు.

చిత్రజ్యోతి

ఒకే వేదికపై నృత్య దర్శకులకు సన్మానం

'డాన్స్ డాన్ గురు స్టెప్స్' అవార్డుల పంపిణీ



నృత్య దర్శకులతో నటుడు విజయ్ సేతుపతి

తమిళ చిత్రపరిశ్రమలో ఎన్నో చిత్రాల విజయంలో కీలక పాత్ర పోషించిన నాటి నుంచి నేటి వరకు నృత్య దర్శకులందరినీ ఒకే వేదికపై చేర్చి ఘనంగా సన్మానించారు. వీరికి 'డాన్స్ డాన్ గురు స్టెప్స్ 2023 కోలివుడ్ అవార్డు'ల పేరుతో ఈ వేడుకలను ఈ నెల 30న నిర్వహించారు. ఇందులో దాదాపు వంద మందికిపైగా నృత్యదర్శకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కూడా పాల్గొన్నారు. సాధారణంగా భారతీయ సినిమా అంటేనే ఆటలు, పాటలు, డ్యాన్స్ వంటి మేళవింపుతో ఉంటుంది. నృత్యాలు సినిమాలో భాగమైపోయాయి. తమిళ చిత్ర పరిశ్రమ ప్రారంభమైన 1938 నుంచి 2023 వరకు అనేక మంది పేరొందిన కొరియోగ్రాఫర్లు పనిచేశారు. ఇలాంటి వారందరినీ ఒక చోట చేర్చి సన్మానించారు. ఇందులో ప్రముఖ నటుడు సేతుపతి పాల్గొని మాట్లాడుతూ... తమిళ చిత్రపరిశ్రమకు చెందిన కొరియోగ్రాఫర్లందరినీ ఒకే వేదికపై చూడటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుల పంపిణీ వేడుకల్లో తాను కూడా పాలు పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.

సత్యరాజ్ - వెట్రి కాంబినేషన్‌లో డార్క్ కామెడీ చిత్రం

సీనియర్ నటుడు సత్యరాజ్, హీరో వెట్రి కాంబినేషన్‌లో డార్క్ కామెడీ జోనర్‌లో ఒక చిత్ర తెరకెక్కనుంది. అమెరికా, మలేసియా దేశాల్లో డాక్యుమెంటరీ చిత్రాలను రూపొందించే నరేంద్రమూర్తి ఈ చిత్రం ద్వారా కోలీవుడ్‌కు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శేఖర్ జి.ప్రొడక్షన్స్ బ్యానరుపై నిర్మాత ఇళయరాజా శేఖర్ నిర్మించే ఈ చిత్రంలో ఎంఎస్ భాస్కర్, కోవై సరళ, సచ్చు, ప్రార్థన, ఐరాలు తదితరులు నటిస్తున్నారు. 'కోడియిల్ ఒరువన్', 'కురంగు బొమ్మై' వంటి చిత్రాలకు పని చేసిన ఎస్.ఎస్.ఉదయ కుమార్ ఛాయాగ్రహణం అందిస్తుండగా, జెరాల్డ్ ఫెలిక్స్ సంగీతం సమకూర్చుతున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమం జరుపుకోగా, త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సెంథిల్ కుమార్, క్రియేటివ్ ప్రొడ్యూసర్స్ నూర్, బాల.



కొత్త చిత్రం పూజా కార్యక్రమంలో వెట్రి తదితరులు

విజయకాంత్ ఉత్తమ లక్షణాలను అనుసరించాలి

● నటుడు శరత్ కుమార్



విజయకాంత్ చిత్రపటానికి శరత్‌కుమార్ నివాళి

దివంగత కెప్టెన్ విజయకాంత్ సుగుణాలు కలిగిన వ్యక్తి అని, ఆయనలోని ఉత్తమ లక్షణాలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని అఖిల భారత సమత్తువ మక్కల్ కట్చి అధ్యక్షుడు, సినీ నటుడు ఆర్.శరత్ కుమార్ పిలుపునిచ్చారు. విజయకాంత్ చనిపోయిన సమయంలో విదేశాల్లో ఉన్న శరత్‌కుమార్ బుధవారం చెన్నైకి వచ్చారు. ఆ తర్వాత కోయంబేడులోని విజయకాంత్ సమాధి వద్దకు వెళ్లి నివాళి అర్పించారు. పిమ్మట సాలిగ్రామంలో ఉన్న విజయకాంత్ నివాసానికి వెళ్లి, అక్కడ కూడా విజయకాంత్ చిత్రపటానికి పూలమాలల వేసి అంజలి ఘటించారు. విజయకాంత్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రేమలతకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 'విజయకాంత్ మృతి చెందిన సమయంలో నేను విదేశాల్లో ఉండటం వల్ల ఆయన అంత్యక్రియల్లో పాల్గొనలేకపోయా. ఆస్పత్రి నుంచి పూర్తిగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో వస్తారని భావించా. కానీ, జరగరానిది జరిగిపోయింది. విజయకాంత్ సుగుణాలు కలిగిన వ్యక్తి. ఆయన ఉత్తమ లక్షణాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలి' అని కోరారు.



లోకేష్ కనకరాజ్‌కు సైకలాజికల్ టెస్ట్ చేయాలి

● హైకోర్టులో పిటిషన్

సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్‌కు సైకలాజికల్ టెస్ట్ చేయాలని కోరుతూ మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలైంది. రాజు మురుగన్ అనే వ్యక్తి దీన్ని దాఖలు చేశారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహించిన 'లియో' చిత్రంలో సింహభాగం హింసాత్మక సన్నివేశాలు ఉన్నాయి. హింస, డ్రగ్స్ స్మగ్లింగ్, తుపాకీ వినియోగం, పోలీసుల సహకారంతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం వంటి సందేశం ఈ చిత్రంలో అధికశాతం ఉంది. లోకేష్ దర్శకత్వం వహించిన అనేక చిత్రాల్లో ఇలాంటి సందేశమే ఉంటుంది. మాదకద్రవ్యాల వినియోగం ద్వారా సమాజానికి చెడు సంకేతం ఇస్తున్నారు. అందువల్ల లోకేష్ కనకరాజ్‌కు సైకలాజికల్ టెస్ట్ నిర్వహించేలా ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు కృష్ణకుమార్, విజయకుమార్‌ల బెంచ్ ముందు విచారణకు రాగా, లోకేష్ కనకరాజ్ తరపు న్యాయవాదులు హాజరుకాకపోవడంతో విచారణను వాయిదా వేశారు.

వీరపాండ్య కట్ట బ్రహ్మన త్యాగాన్ని స్మరించుకుందాం

● 265వ జయంతి వేడుకల్లో ఆచార్య సీఎంకే రెడ్డి



వీరపాండ్య కట్ట బ్రహ్మన విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆచార్య సీఎంకే రెడ్డి తదితరులు

ప్యారీస్, జనవరి 3: 18వ శతాబ్దంలో వ్యాపారం నిమిత్తం భారతదేశంలో అడుగుపెట్టిన ఈస్టిండియా కంపెనీని ఎదిరించి 39 ఏళ్లకే ఉరితాడును ముద్దాడిన పాంచాలపురం ప్రభువు, తొలి విప్లవ వీరుడు వీరపాండ్య కట్ట బ్రహ్మన త్యాగాన్ని నిత్యం స్మరించుకోవాలని అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్), లిమ్‌ఫోట్ చైర్మన్ ఆచార్య సీఎంకే రెడ్డి పేర్కొన్నారు. కట్ట బ్రహ్మన 265వ జయంతిని పురస్కరించుకొని గిండిలోని గాంధీ మండపం ప్రాంగణంలో ఉన్న కట్ట బ్రహ్మన విగ్రహానికి బుధవారం ఏఐటీఎఫ్ తరపున ఆచార్య సీఎంకే రెడ్డి పూలమాలలు సమర్పించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యాపారం నిమిత్తం వచ్చిన ఈస్టిండియా కంపెనీ ప్రజల నుంచి కప్పం వసూలు చేయడాన్ని 18వ శతాబ్దంలో పాంచాలపురాన్ని పాలించిన ప్రభువు కట్టబొమ్మన్న అడ్డుకుని తొలి విప్లవ వీరుడిగా దేశ చరిత్రలో నిలిచిపోయారని, ఆయన్ను బ్రిటీష్ పాలకులు ఉరి వేశారని, అయితే తమిళనాడుకు చెందిన ఈ విప్లవవీరుడికి ఇప్పటివరకు తగిన గుర్తింపు రాలేదన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో వీరపాండ్య కట్ట బ్రహ్మన త్యాగానికి ప్రతీకగా ఆయన పేరుతో నేవల్ జోన్ ఉందని, తమిళనాడు ప్రభుత్వం కూడా ఇలాంటి గౌరవాన్ని చేకూర్చాలన్నారు. రాష్ట్ర జనాభాలో తెలుగు మాతృభాష కలిగిన ప్రజల ఓటు బ్యాంక్ అధికంగా ఉందని, రాజకీయపార్టీలు ఎన్నికల సమయంలో మాత్రమే ఆ ఓట్ల కోసం హామీలు గుప్పిస్తున్నాయని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు తెలుగు వారంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. వీరపాండ్య కట్ట బ్రహ్మన రాజకంబళ కమ్యూనిటీ సంక్షేమ సంఘం నిర్వాహకులతో కలసి జయంతి వేడుకలు జరుపుకోవడం, అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో ఏఐటీఎఫ్ నిర్వాహకులు నిర్మల్ చందర్, ఆర్.దామోదరన్, లయన్ జి.మురళి, సెంథిల్ కుమార్, ఎస్.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు

అడయార్, జనవరి 3: భారత్ గౌరవ్ పథకం కింద సేవలను అందించే అత్యంత విజయవంతమైన ప్రైవేట్ రైలు 'ఉలా' అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని తన తీర్థయాత్ర వివరాలను బుధవారం వెల్లడించింది. వారణాసి - అయోధ్య - ప్రయాగ్ రాజ్‌కి ఫిబ్రవరి 8నుంచి 14వ తేదీ వరకు మొత్తం ఏడు రోజుల పాటు పవిత్ర నగరాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరిస్తూ కొనసాగుతుంది. వారణాసి పట్టణం ఆధ్యాత్మిక విశిష్టతను వివరించడం, అయోధ్యలోని రామమందిరంలో ప్రారంభోత్సవ్వాన చూడటం, ప్రయాగ్‌రాజ్ పవిత్ర సంగమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించేలా కొనసాగుతుంది. ఇది చెన్నై నుంచి బయలుదేరి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, కాజీపేట్, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్‌లలో ఆగి, పర్యాటకులను ఎక్కించుకుని బయలుదేరుతుంది. పర్యాటకులకు యాత్ర పొడవునా అన్ని ఆధ్యాత్మిక, చారిత్రాత్మక వివరాలను వెల్లడించేందుకు వీలుగా పీఏ సిస్టమ్స్, సీసీ కెమెరాలు, కోచ్ సెక్యూరిటీ, టూర్ మేనేజర్లు, ట్రావెల్ ఇన్సూరెన్స్, హోటల్, సందర్శన, రవాణా, మూడు పూటలా దక్షిణ భారత భోజనం సహా వివిధ రకాలైన సౌకర్యాలను కల్పిస్తారు. యాత్రికులు ఎల్టీసీ, ఎల్ఎఫ్‌సీ సౌకర్యం కూడా పొందవచ్చు. ఇందులో స్లీపర్ క్లాస్ టిక్కెట్ రూ.16,400గాను, స్లీపర్ క్లాస్ (ఎకానమీ) టిక్కెట్ రూ.19,400, థర్డ్ ఏసీ (కంఫర్ట్) రూ.25,800, సెకండ్ ఏసీ (డీలక్స్) టిక్కెట్ రూ.31,800గా నిర్ణయించారు. పూర్తి వివరాలకు నెం. 78761 01010లో లేదా "www.railtourism.com' అనే వెబ్‌సైట్‌లో చూసి తెలుసుకోవచ్చని ట్రావెల్ టైమ్స్ ప్రొడక్ట్ మేనేజర్ విఘ్నేష్ పేర్కొన్నారు.

ప్రధాని మోదీ కలలు ఎన్నటికీ ఫలించవు

● కేఎస్ అళగిరి

అడయార్, జనవరి 3: ప్రధాని నరేంద్రమోదీ కలలు రాష్ట్రంలో ఎన్నటికీ ఫలించబోవని టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి అన్నారు. ఇదే విషయంపై ఆయన బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తిరుచ్చి విమానాశ్రయం కొత్త టెర్మినల్ ప్రారంభోత్సవంతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రధాని మోదీ... తన మాటల చాతుర్యంతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించారన్నారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెన్నైతో పాటు, కాంచీపురం, తిరువళ్ళూరు, చెంగల్పట్టు జిల్లాలు, ఆ తర్వాత కురిసిన అతి భారీ వర్షాలకు తూత్తుక్కుడి, తిరునెల్వేలి, తిరుచ్చి, కన్నియాకుమారి జిల్లాలు నీట మునిగాయన్నారు. ఈ వరద బాధిత ప్రాంతాల్లో తొలుత కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆ తర్వాత కేంద్ర బృందం, పిమ్మట ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లు పర్యటించి జరిగిన నష్టాన్ని కళ్ళారా చూశారన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు నిధులను కేటాయించాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పలుమార్లు కేంద్రానికి లేఖలు రాశారని, ప్రధాని మోదీకి స్వయంగా విజ్ఞప్తి చేసి, లేఖ కూడా అందజేశారన్నారు. కానీ, విపత్తు సహాయ నిధులను ముందస్తుగా విడుదల చేసి చేతులు దులుపుకున్నారనే గానీ, రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించలేదని ఆయన గుర్తు చేశారు. కానీ, ప్రధాని మోదీ చేసిన ప్రసంగాల్లో పేర్కొన్నట్టుగా ఆయన కలలు ఎన్నటికీ ఫలించవన్నారు.

50 మంది ఉద్యోగులకు కార్లను బహూకరించిన కంపెనీ



ఉద్యోగినికి కారు తాళం నమూనాను అందజేస్తున్న దృశ్యం

అడయార్, జనవరి 3: చెన్నై నగరంలో కేంద్ర కార్యాలయాన్ని కలిగి తన వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న 'ఐడియాస్2ఐటీ' అనే కంపెనీ తమ సంపదను ఉద్యోగులకు కూడా పంచుతోంది. ఇందులోభాగంగా, తమ వద్ద పనిచేసే ఉద్యోగుల్లో 50 మందిని ఎంపిక చేసి 50 కార్లను బహుమతిగా అందజేసింది. 'ఎంప్లాయిస్ ఓనర్‌షిప్ ప్రోగ్రాం' కింద ఈ కార్లను బహూకరించి, ఉద్యోగులను సంభ్రమాశ్చర్యాలకులోను చేసింది. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు 33 శాతం వాటాను కలిగిన వారవుతారని కంపెనీ ఫౌండర్ మురళి వివేకానందన్, భవానీ రామన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐడియాస్2ఐటీ సీఈవో గాయత్రి వివేకానందన్, డైరెక్టర్ అరుణ్ గణేశన్, సీనియర్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ రాకతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అన్నామలై

అడయార్, జనవరి 3: ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటన తర్వాత పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం వచ్చిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై అన్నారు. పరమకుడిలో ఏర్పాటుచేసిన సేలం పార్లమెంట్ సెగ్మెంట్ పార్టీ కార్యాలయాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపిందన్నారు. మంచి తమిళ పదాలను ఉపయోగించడం రాష్ట్ర ప్రజలతో ప్రధాని మోదీని బాగా మమేకమయ్యేలా చేసిందన్నారు. అదేసమయంలో సేలం పెరియార్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అరెస్టు వ్యవహారంలో రాష్ట్ర పోలీసులు వ్యవహరించిన తీరు ఏమాత్రం సంతృప్తికరంగా లేదన్నారు. వీసీని అరెస్టు చేసిన తర్వాత నాలుగు గంటల పాటు వ్యానులోనే ఉంచారన్నారు. ఒక విశ్వవిద్యాలయ వీసీ అరెస్టు కావడం తలదించుకోవాల్సిన విషయమన్నారు. ఇదిలావుండగా అన్నామలై ఈనెల 4న గురువారం నుంచి తన పాదయాత్రను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు ఎడప్పాడిలో జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

చైనా తరహాలో తిరుమంగళం వద్ద 12 అంతస్థుల భవనంలో మెట్రోరైలు పరుగులు



చైనాలో భవన సముదాయంలో దూసుకెళ్తున్న రైలు

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ రద్దీని శాశ్వత పరిష్కారం దిశగా అమలు చేస్తున్న రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో చైనా తరహాలో భవనాల నడుమ రైలు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. చైనాలోని సోగింగ్‌లో 19 అంతస్థులు కలిగిన రెసిడెన్షియల్ ప్రాంగణం ఆరో అంతసులో మెట్రోరైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేసి రైలును నడుపుతున్నారు. ఆ తరహాలోనే నగరంలోని తిరుమంగళం ఫ్లైఓవర్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతం వద్ద 12 అంతస్థులు కలిగిన భవన సముదాయం మీదుగా మెట్రోరైలును నడిపేలా చెన్నై మెట్రో రైల్వేస్ సంస్థ ప్రణాళికలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకు సమర్పించింది. ఈ విషయమై మెట్రోరైల్వేస్ ఉన్నతాధికారి మాట్లాడుతూ... ప్రస్తుతమున్న మెట్రోరైలు మార్గాలలో ఎత్తయిన చోట్ల రైల్వేస్టేషన్లు ఉన్నాయని, కాకపోతే ఆ స్టేషన్ల చుట్టూ ఎలాంటి భవనాలు లేవన్నారు. విదేశాల్లో జనావాస ప్రాంతాల నడుమ ప్రత్యేకించి రెసిడెన్షియల్ క్వార్టర్స్ వద్ద రైళ్లను నడుపుతుంటారని, ఇళ్లకు చేరువగా రైలు ఉండటంతో స్థానికులు పెద్ద సంఖ్యలో వాటిలో ప్రయాణిస్తుంటారని తెలిపారు. ఆ విధంగానే నగరంలోనూ తిరుమంగళంలోని ఫ్లైఓవర్‌ను ఆనుకుని రెసిడెన్షియల్ క్వార్టర్స్ ఉన్న ప్రాంతం వద్ద గతంలో మూడెకరాలుండిన చోట 450 మీటర్ల పొడవు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తిరుమంగళం ఫ్లైఓవర్ పైభాగాన మెట్రో రైల్వేస్టేషన్ నిర్మించి, 12 అంతస్థులు కలిగిన భవనసముద్రం నడుమ మెట్రోరైలు చొచ్చుకుని పోయే రీతిలో సిద్ధం చేసిన కొత్త ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం పరిశీలిస్తోందన్నారు. అదే విధంగా నాగపూర్‌లోని జీరోమైల్ మెట్రోరైల్వేస్టేషన్‌పై ప్రస్తుతం 15 అంతస్థులతో కూడిన స్టార్‌హోటల్ నిర్మిస్తున్నారని చెప్పారు. ఆ తనహాలోనే నగరంలోనూ మెట్రోరైల్వేస్ సంస్థ ఆదాయవనరులను పెంచుకునేందుకు జననివాస భవనాల నడుమ రైల్వేస్టేషన్లను నిర్మించి రైళ్లను నడపాలని భావిస్తోందన్నారు. ప్రస్తుతానికి టిక్కెట్ల ద్వారా వచ్చిన ఆదాయం వల్లే రైళ్లను నడపటం మరింత నష్టాలనే కలిగిస్తాయన్నారు. ఈ పరిస్థితులలోనే జననివాస ప్రాంతాలకు చేరువగా రైళ్లను నడపాలని నిర్ణయించామన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన





సామూహిక కుంకుమార్చన పూజలో ముత్తయిదువులు - శ్రీదేవిభూదేవి సమేత శ్రీవారికి మంగళహారతి సేవ

● రంగనాథుడి ఆలయంలో ముగిసిన దశావతార ఉత్సవాలు

ప్యారీస్, జనవరి 3: స్థానిక షావుకారుపేట ముల్లా వీధిలో ఉన్న రంగనాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రారంభమైన దశావతార ఉత్సవాలు సామూహిక కుంకుమార్చన, మంగళ హారతి పూజలతో ముగిశాయి. హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు గత నెల 22న దశావతార ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించి అవతారాల చిత్ర ప్రదర్శనను వీక్షించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జాలమడుగు హరికుమార్ నేతృత్వంలో ఆలయ ప్రాంగణంలో 12 రోజులు విష్ణు సహస్రనామ పారాయణం, హరి నామ సంకీర్తనం, ఆండాళ్ పాశురాలు, భక్తిపాటల సంగీతం, భరత నాట్యం, ఆధ్యాత్మిక ప్రసంగాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజైన మంగళవారం రాత్రి 7 నుంచి 10 గంటల వరకు ఐశ్వర్య దేవకుమార్ బృందం భక్తిగీతాలు ఆలపించింది. 308 మంది ముత్తయిదువులు ఆలయ ప్రాంగణంలో వరుసగా కూర్చొని స్వామివార్ల కటాక్షం కోసం కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాలు విజయవంతమయ్యేందుకు సహకరించిన ఆలయ అధికారులు ముల్లై, నిత్య, జయరామన్ సహా మహిళలకు నూతన వస్త్రాలను హరికుమార్ దంపతులు పంపిణీ చేశారు.

సానుకూల దృక్పథంతో వ్యాధుల ఆగమనం ఆలస్యం

● డాక్టర్ జి.శివరామన్

అడయార్, జనవరి 3: సానుకూల దృక్పథం వ్యాధుల ఆగమనాన్ని ఆలస్యం చేస్తుందని ప్రముఖ సిద్ధ వైద్యుడు, ఆరోగ్య హెల్త్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.శివరామన్ అన్నారు. చెన్నైలో అంతర్జాతీయ మైండ్ బాడీ, వెల్‌నెస్ అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ... సానుకూల మైండ్ సెట్, యోగా, సంగీతం, ఆహారం, సామాజిక జీవితం వంటి అంశాలు సానుకూల వైబ్‌లు, ప్రవర్తనలో మార్పులు తీసుకొస్తాయని పేర్కొన్నారు. మెదడు, శరీరం, ఔషధాలు మధుమేహం, రక్తపోటు సహా అనేక వ్యాధులు, నాన్ అంటువ్యాధుల ఆగమనాన్ని ఆలస్యం చేస్తాయన్నారు. ఈ సదస్సులో మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ కె.బాలాజీ మాట్లాడుతూ, అనేక మంది ఎంబీబీఎస్ విద్యార్థులు తమ ఐచ్ఛికాలలో మైండ్ బాడీ మెడిసిన్‌ను తీసుకుంటారని, ఈ రంగానికి ఉన్న ఆదరణను ఇది ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.



రాజ్‌భవన్‌లో స్వాతంత్ర్య సమరవీరులు వీరమంగై వేలునాచ్చియార్, వీరపాండ్య కట్ట బ్రహ్మన జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి.



చెన్నైలో స్వాతంత్ర్య సమరయోధుడు వీరపాండ్య కట్ట బ్రహ్మన జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళి అర్పిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి